సహకార సంఘాలకు ప్రత్యేక గుర్తింపు

- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు
- సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

మల్లాపూర్‌లో ఎరువుల గోదాం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

మల్లాపూర్, మార్చి 14: తెలంగాణలోని సహకార సంఘాలకు దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గురువారం మల్లాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో నాబార్డ్ నిధులు సుమారు రూ. 23 లక్షలతో నిర్మించిన ఎరువుల గోదాం, రూ.60 లక్షలతో నిర్మించిన నూతన కార్యాలయ భవనాల ప్రారంభంతో పాటు, రూ.45 లక్షలతో నిర్మించనున్న కేడీసీసీబీ బ్యాంక్ భవన నిర్మాణానికి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొండూరి మాట్లాడుతూ తెలంగాణలో సహకార సంఘాలు బలోపేతంగా ఉన్నాయన్నారు రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సహకార సంఘం బ్యాంక్‌లు, సొసైటీల్లో పని చేసే ఉద్యోగులకు భద్రతా, ప్రతి అంశం కంప్యూటీకరణ చేయడంపై కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా చాలా సందర్భాల్లో తెలంగాణ సహకార సంఘాలను ప్రశంసించారని గుర్తు చేశారు. తెలంగాణలోని సహకార సంఘాల మాదిరిగా మిగతా రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని సూచించినట్లు తెలిపారు. అలాగే కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని సహకార సంఘాల సేవలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లోని సహకార సంఘాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇక్కడ ఉమ్మడి జిల్లా సీఈవో సత్యనారాయణరావు, డీసీవో సత్యనారాయణ, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ సరోజన, సహకార సంఘాల చైర్మన్లు నర్సారెడ్డి, నరేశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు జీవన్‌రెడ్డి, మల్లయ్య, శరత్‌గౌడ్, లింగస్వామి గౌడ్, సీఈవో భూమేశ్, పాలకవర్గ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' ఆన్‌లైన్‌లో తిప్పలు

- వివరాలు సక్రమంగా ఉన్న దరఖాస్తుల తిరస్కరణ
- ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోల జమున

సారంగాపూర్, మార్చి14: ఆయా గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ కాకపోవడంతో గృహజ్యోతి పథకంలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్, జీరో కరెంట్ బిల్ రావడం లేదని మండల సభ్యులు మండిపడ్డారు. గురువారం సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ కోల జమున అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సోల్లు సురేందర్, ఎంపీటీసీలు భుక్యా లావణ్యరాథోడ్, జోగినిపెల్లి సుధాకర్‌రావు, మాలెపు విమల మాట్లాడుతూ.. ప్రజాపాలనలో అన్ని వివరాలు సక్రమంగా నింపి దరఖాస్తు చేసుకున్న పలువురికి గృహజ్యోతి వర్తించడం లేదన్నారు. దీంతో మళ్లీ ఎంపీడీవో కార్యాలయం చుట్టు దరఖాస్తు చేసుకునేందుకు పడిగాపులు కాస్తున్నారని వాపోయారు. ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించేందుకు మండల కేంద్రంలో కాకుండా ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో హెల్ప్ సెంటర్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని అధికారులకు సూచించారు. దాదాపు రెండు వేల విద్యుత్ కనెక్షన్లు ఆన్‌లైన్ కాలేదని, వాటిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఆరోగ్య కేంద్రంలో పీఏసీ కమిటీ మీటింగ్ ఎందుకు పెట్టడం లేదని వైస్ ఎంపీపీ సోల్లు సురేందర్, సంబంధిత అధికారిని ప్రశ్నించారు. అర్పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రద్దు చేశారని, దానిని యదావిధిగా కొనసాగించాలని సూచించారు. తనకు నాలుగు ఎకరాల్లోపు భూమి ఉందని ఇంత వరకు రైతుబంధు పడలేదని, ఎన్ని ఎకరాల వరకు ఇస్తారో స్పష్టంగా చెప్పాలని పోతారం ఎంపీటీసీ సుధాకర్‌రావు అధికారులను నిలదీశారు. రేషన్ కార్డుల్లో పేర్లు ఉండి దుబాయ్, ఇతర దేశాలకు వెళ్లిన వారి పేర్లు తొలగించారన్నారు. ఇప్పుడు వారు వచ్చిన రేషన్ కార్డుల్లో పేర్లు ఎక్కడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. పోతారంలో కిలోమీటర్ మేర మిషన్ భగీరథ పైపులైన్ వేయకున్న బిల్లులు తీసుకున్నారని, నల్లాలు కూడా ఏర్పాటు చేయలేదని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సుధాకర్‌రావు తెలిపారు. ఆయా గ్రామాల సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి సాగునీరు ఇంకా ఎన్ని తడులు ఇస్తారో అధికారులు స్పష్టంగా చెప్పాలన్నారు. గ్రామాల్లో కొత్త పింఛన్లు ఎప్పుడు వస్తాయని ప్రజలు అడుగుతున్నారన్నారు. రైతులకు పంటల కొనుగోలుపై రూ.ఐదు వందల బోనస్‌ను అమలు చేయాలని కోరారు. అనంతరం ఎంపీపీ కోల జమున మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో వెంకటేశం, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

- పార్టీలకతీతంగా సేవకుడు
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశంసలు

జగిత్యాల, మార్చి 14: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందరివాడు అని, పార్టీలకతీతంగా సేవ చేసే గుణం ఉన్న వ్యక్తి అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశంసించారు. గురువారం రాత్రి జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ గార్డెన్‌లో జరిగి పెరిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డానని, ఈ క్రమంలో విషయం తెలియగానే ఎమ్మెల్యే సంజయ్ స్పందించి, యశోద దవాఖానకు ఫోన్ చేసి తనను అడ్మిట్ చేయించారన్నారు. అలాగే అక్కడ ఉన్న డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం చేయించిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. సమావేశానికి హాజరైన డాక్టర్ సంజయ్‌కు అడ్లూరి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎమ్మెల్యే పూజలు

కోరుట్ల, మార్చి 14: పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వార్డు కౌన్సిలర్ మాడవేణి నరేశ్ ఆధ్వర్యంలో అంజన్న స్వాములకు ఉచితంగా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్ గంధం గంగాధర్, నాయకులు రాజారెడ్డి, శ్రీపతి, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల ఎమ్మెల్యేను అభినందిస్తున్న అడ్లూరి

మరణంలోనూ ఔదార్యం

- బ్రెయిన్ డెడ్ అయిన అంబారిపేటకు చెందిన రాధ
- అవయవదానం చేసిన కుటుంబసభ్యులు

రాధ (ఫైల్)

కథలాపూర్, మార్చి 14: మరణంలోనూ వారు ఔదార్యాన్ని చూపారు. కన్నీళ్లను దిగమింగుకొని అనారోగ్యంతో బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ అవయవాలను దానం చేసి మరికొందరి ప్రాణాలను కాపాడారు. ఆపదకాలంలోనూ దాతృత్వాన్ని ప్రదర్శించిన వీరిని దవాఖాన వైద్య సిబ్బంది, పలు స్వచ్ఛందసంస్థల సభ్యులు అభినందించారు. వివరాలు.. కథలాపూర్ మండలం అంబారిపేటకు చెందిన గోపు రాధ(38) నాలుగేండ్లుగా నరాల సంబంధ వ్యాధితో బాధపడుతున్నది. ఈ క్రమంలో ఈ నెల 10న తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో కిమ్స్ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ నెల 12న రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. అమె అవయవాలు దానం చేయాలని వైద్యులు సూచించగా.. కుటుంబ సభ్యులు జీవన్‌దాన్ సభ్యులతో చర్చించి అంగీకరించారు. గురువారం వేకువజామున రాధ శరీరం నుంచి పలు అవయవాలు సేకరించి అవసరమున్న రోగులకు అమర్చారు. కాగా, దవాఖాన సిబ్బంది రాధ మృతదేహానికి గౌరవ వందనం చేశారు. కుటుంబసభ్యురాలిని కోల్పోయి కన్నీళ్లపర్యంతమవుతూ నే ఇంకోకరి కోసం అవయవాలు దానం చేసేందుకు రాధ కుటుంబసభ్యులు ముందుకు రావడంపై పలువురు అభినందించారు. కాగా, మృతురాలి భర్త గోపు శ్రీనివాస్ అంబారిపేట తాజా మాజీ సర్పంచ్, వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు.

సమావేశాలకు అధికారులు హాజరుకావాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ములాసపు లక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న జగిత్యాల అర్బన్ మండల ఎంపీపీ ములాసపు లక్ష్మి

జగిత్యాల రూరల్, మార్చి 14: మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు తప్పకుండా హాజరు కావాలని జగిత్యాల అర్బన్ మండల ఎంపీపీ ములాసపు లక్ష్మి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు గైర్హాజరు కాకుండా తప్పని సరిగా హాజరు కావాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం పలు సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. పీఎం కిసాన్ స్కీం డబ్బులు రైతుల ఖాతాల్లో పడడం లేదని ఎంపీటీసీలు రొక్కం రాజశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి పేర్కొన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించినప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలకు కనీస సమాచారం ఇవ్వడం లేదన్నారు. మోతెలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు కనెక్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పాఠశాలకు ప్రహరీ, అదనపు తరగతి గదులను నిర్మించాలని ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. డీ57, 58 కెనాల్‌కు షటర్స్ ఏర్పాటు చేయాలని హస్నాబాద్ ఎంపీటీసీ మల్లారెడ్డి అధికారులను కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సంగెపు మహేశ్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

'ప్రకృతి వైపరీత్యాల'పై అవగాహన

వెల్గటూర్, మార్చి 14: ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు, ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ సూరజ్ ఆధ్వర్యంలో మండలంలోని శెగ్యాం గ్రామంలో గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎండపల్లి డ్యాం దాని ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించారు. వరదలు, పాముకాటు, హార్ట్‌ఎటాక్ వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, డీటీ గంగాధర్, ఆర్ఐ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి నరేశ్, ప్రజలు పాల్గొన్నారు.

విధులను పకడ్బందీగా నిర్వహించాలి

జగిత్యాల, మార్చి 14: ఎన్నికల విధులను సెక్టోరల్ అధికారుల పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాంబాబు ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సమీకృత కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంట్ నియోజవర్గ పరధిలోని సెక్టోరల్ అధికారులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. ఈవీఎంలు, పోలింగ్ స్టేషన్లపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ దివాకర మాట్లాడుతూ.. వల్నారేబిలిటీ మ్యాపింగ్, సెక్టార్ మ్యాపింగ్ కనీస వసతులను గురించి పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు పులి మధుసూదన్ గౌడ్, ఆనంద్ కుమార్, రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్ డాక్టర్ పడాల తిరుపతి, నోడల్ అధికారి, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు కేంద్ర బలగాలు

ఎస్పీకి పూల కుండీని అందజేస్తున్న సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్

జగిత్యాల కలెక్టరేట్, మార్చి 14: లోక్ సభకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కేంద్ర సాయుధ బలగాలు జగిత్యాలకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ కంపెనీ అధికారులు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌ను పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఉన్న పోలీస్ స్టేషన్లు, చెక్‌పోస్టులు, జిల్లా భౌగోళిక పరిస్థితులను ఎస్పీ, సీఐఎస్ఎఫ్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు, సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సతీశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సచిన్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రధాన పరీక్షలు

జగిత్యాల టౌన్, మార్చి 14: ఇంటర్ ప్రధాన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు కన్వీనర్ నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సర జనరల్ విద్యార్థులకు జరిగిన రసాయన శాస్త్రం, వాణిజ్య శాస్త్రం పరీక్షలో 5715 మంది విద్యార్థులకు గానూ 5620 మంది హాజరుకాగా 95 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 600 మంది విద్యార్థులకు గానూ 557 మంది హాజరు కాగా, 43 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 97.81 శాతం మంది హాజరయ్యారు. 18 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్‌స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్, పరీక్షల కన్వీనర్‌తో కలిసి తనిఖీలు చేసినట్లు పేర్కొన్నారు. తొమ్మిది కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు బ్రిడ్జికోర్స్ పరీక్షలు రేపు, ఎల్లుండి జరగనున్నట్లు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ధర్మపురి/ధర్మపురి రూరల్,మార్చి14: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ధర్మపురి మండలం కొసునూర్‌పల్లిలో 84 మంది లబ్ధిదారులకు భూమి హద్దు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలకు గాడెపల్లి శివారులోని ప్రభుత్వ భూమి హద్దు పత్రాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మారెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య ఉన్నారు.

నర్సన్న బ్రహ్మోత్సవాలకు రండి

ఈనెల 20 నుంచి ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు హాజరు కావలసిందిగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు దేవస్థానం సిబ్బంది ఆహ్వాన పత్రికను అందజేశారు. గురువారం ధర్మపురిలోని ఆయన గృహంలో కలిసి ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. ఇక్కడ ఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మసర్తి రమేశ్

సారంగాపూర్, మార్చి 14: గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ మసర్తి రమేశ్ సూచించారు. బీర్‌పూర్‌లోని రైతువేదిక ఆవరణలో గురువారం ఎంపీపీ రమేశ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలులోకి వచ్చాయన్నారు. కరెంట్ బిల్, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ రానివారు ఎవరూ కూడా ఆందోళన చెందొద్దన్నారు. రానివారు ఎవరైనా ఉంటే ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే అర్హత పొందుతారన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో సాగు, తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం పూట టిఫిన్ పెట్టాలని తుంగూర్ ఎంపీటీసీ ఆడెపు మల్లేశ్వరి కోరారు. గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కొల్వాయి ఎంపీటీసీ రంగు లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధి పనులు, తదితర అంశాలపై సభ్యులు సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో లచ్చాలు, సింగిల్ విండో చైర్మన్ పోలుసాని నవీన్ రావు, అధికారులు పాల్గొన్నారు.

పోషణ్ పక్షోత్సవాలపై అవగాహన

జగిత్యాల రూరల్: సీమంతం చేస్తున్న సీడీపీవో, అంగన్‌వాడీలు

జగిత్యాల రూరల్/సారంగాపూర్/మెట్‌పల్లి రూరల్, మార్చి14: జగిత్యాల పట్టణంలోని 28వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రం, సారంగాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండలంలోని లక్ష్మీదేవిపల్లి, మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో పోషకార ప్రతిజ్ఞను నిర్వహించారు. సీడీపీవో వీరలక్ష్మి మాట్లాడుతూ.. ఈనెల 9నుంచి 23 వరకు పోషన్ పఖ్వాడా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు జానకి, లత, శైలజ, హైమదీబేగం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బైపాస్ అలైన్‌మెంట్ మార్చాలి

కోరుట్ల, మార్చి 14: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిజామాబాద్ జిల్లా పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు చేపడుతున్న బైపాస్ రోడ్డు సర్వే అలైన్‌మెంట్ మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల మండలంలోని గుమ్లాపూర్ రైతులు ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం అందజేశారు. గుమ్లాపూర్‌లో రిజిస్ట్రేషన్ విలువ తక్కువగా ఉండి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరల దృష్ట్యా పరిహారం పెంపుపై పూర్తి స్థాయిలో హామీ ఇవ్వాలని రైతులు కోరారు. బైపాస్ రోడ్డు పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ రైతులు ఆశోక్ రావు, సతీశ్, బలరాం, నాగభూషణం, వెంకటి, శాంత, పెద్ద రాజం, సాగర్‌రావు, బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★KNR సుభాష్‌నగర్‌లోని పుల్లెల హాస్పిటల్‌లో పనిచేయుటకు రిసెప్షనిస్ట్ (డిగ్రీ & కంప్యూటర్ నాలెడ్జ్), ఫార్మాసిస్ట్, డిఫార్మసీ/బీఫార్మసీ, నర్సింగ్ స్టాఫ్ (ANM/GNM) కావలెను. స్వయంగా సంప్రదించగలరు.
NTK-317415
CHANGE OF NAME
★I, SYED MISBHA UDDIN, R/o. 7-3-29, Kashmeergadda, Karimnagar, TS, have Changed My Name as SYED MISBAH UDDIN, S/o. Syed Moizuddin.
NT-328406
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

వాటర్ ప్లాంట్ల తనిఖీ

కోరుట్ల, మార్చి 14: పట్టణంలోని ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు, ఐస్‌క్రీమ్ తయారీ, విక్రయ కేంద్రాలను గురువారం మున్సిపల్ అధికారులు తనిఖీ చేశారు. శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించని యజమానులకు జరిమానా విధించారు. ఐఎస్ఐ మార్క్ లేకుండా వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ ఉన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

మల్లాపూర్, మార్చి 14: నాయక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మల్కాజ్‌గిరి జిల్లా ఎక్సైజ్ శాఖ డీఎం గుగ్లావత్ జీవన్ నాయక్ గురువారం తన స్వగ్రామమైన వీవీరావు పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడు దత్తాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్చకుల సమావేశం

జగిత్యాల రూరల్, మార్చి 14: ధరూర్ క్యాంపులోని కోదండ రామాలయంలో గురువారం దూప దీప నైవేద్యాల అర్చకులు సమావేశాన్ని నిర్వహించారు. కొత్తగా నియామకమైన అర్చకులకు కొంతమందికి వేతనాలు ఇంత వరకు రాలేదని వాపోయారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి స్వామి, జిల్లా అర్చక సెలక్షన్ కమిటీ సభ్యులు, త్రీమెన్ కమిటీ సభ్యులు ఆంజనేయచారి, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు ఓరుగంటి మాదవచార్యులు, పుకాంత శర్మ, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు

మల్లాపూర్, మార్చి 14: పాతదాంరాజ్‌పల్లిలోని మార్కండేయ ఆలయ నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.3.50 లక్షల మంజూరైనట్లు బీజేపీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సంబంధిత నిధుల మంజూరు పత్రాన్ని పద్మశాలీ సేవా సంఘం మండలాధ్యక్షుడు అయ్యోరి దశరథంకు గురువారం అందజేశారు.

మండల దీక్షలు ప్రారంభం

మల్లాపూర్/మారుతీనగర్, మార్చి 14: మల్లాపూర్ మండలం వాల్గొండలోని గోదావరి నది తీరాన గల హన్‌మాన్ దీక్ష పీఠం వద్ద 200 మంది భక్తులు హన్‌మాన్ పీఠం వ్యవస్థాపకుడు శశికాంత్‌శర్మ ఆధ్వర్యంలో గురువారం మండల దీక్షలు స్వీకరించారు. మారుతీనగర్ అభయహస్త హనుమాన్ ఆలయంలో 39 మంది, పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో 46మంది, కాశీ భాగ్ హనుమాన్ ఆలయంలో వందకు పైగా మంది హనుమాన్ మండల దీక్ష(41 రోజులు) మాలధారణ చేసినట్లు ఆయా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, మార్చి 14: రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తున్నదని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. క్షత్రియ పెరిక సంఘం నూతన జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ రూ.10వేల కోట్లను కార్పొరేషన్లకు కేటాయిస్తే బాగుంటుందని, దీని వల్ల స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. పెరిక సంఘం కుల వృత్తి వ్యవసాయమని, దానిపైనే ఆధారపడి ఉంటుందని, వీటిని అభ్యున్నతిలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ దావసంత, కందుల సంధ్యారాణి, పెరిక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు జేఏసీ కో-కన్వీనర్ ఎన్నమనేని శ్రీనివాస్‌రావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఆయన ఇంటికి ఎమ్మెల్సీ వెళ్లి ఆర్థిక సహాయం చేశాడు. ఉద్యకారులకు చేయూత అందించేందుకు విధి, విధానాలు ర